

నేడు మల్లన్నసాగర్‌లోకి

గోదావరి జలాల ఎత్తిపోత

తొగుట, ఆగస్టు 7: తొగుట మండలం తుక్కాపూర్ శివారులో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి నేడు ఉదయం 9 గంటలకు నాలుగు పంపుల ద్వారా 5వేల క్యూసెక్కుల గోదావరి నీటిని ఎత్తి పోయనున్నట్లు మల్లన్నసాగర్ డీఈ చెన్ను శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతానికి 8.55 టీఎంసీల నీరు నిల్వ ఉందని, నాలుగు రోజుల పాటు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసి వానాకాలం సాగుకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

సంగారెడ్డి నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలకు..

6 నుంచి 12వ తరగతి వరకు గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని దామోదర్‌ను కోరిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 7 : సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఇతర వర్గాల విద్యార్థుల కోసం గురుకుల పాఠశాల భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు బాల, బాలికల కోసం ప్రతీ నియోజకవర్గంలో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే సంగారెడ్డి నియోజకవర్గంలోని సదాశివపేట పట్టణం సిద్దాపూర్ గ్రామ శివారులోని 268 సర్వే నంబరులో 11.33 ఎకరాలు, 269 సర్వే నంబరులో 18.9 ఎకరాల భూమిని గుర్తించి కలెక్టర్ క్రాంతి వల్లూరు సీసీఎల్ఏకు ప్రతిపాదనలు పంపారని తెలిపారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఇతర వర్గాల కోసం నిర్మించనున్న గురుకుల పాఠశాలల సముదాయాల నిధులు తక్షణమే మంజూరు చేయించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించారు.



మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రాన్ని అందజేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి

మోదీని కలిసిన ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక/మెదక్ అర్బన్, ఆగస్టు 7: చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మోదీకి నూలుపోగు దండహారాన్ని సమర్పించారు. అలాగే ఆయన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిశారు. తెల్లపూర్ నుంచి సిద్దిపేట వరకు రైల్వేలైన్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. తెల్లపూర్-పటాన్‌చెరువు-సంగారెడ్డి-జోగిపేట-మెదక్-రామాయంపేట మీదుగా సిద్దిపేట వరకు రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే పూర్తి చేశారన్నారు. ఈ లైన్‌తో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వినతిని పరిశీలించి ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చేగుంట దగ్గర ఆర్వోబీ (రైల్వేఓవర్ బ్రిడ్జి)ను నిర్మించాలని కేంద్ర మంత్రిని కోరారు.



మోదీకి నూలుపోగు దండను సమర్పిస్తున్న రఘునందన్‌రావు

వరుకోలులో వ్యక్తి హత్య

- కొడుకే తండ్రిని హతమార్చాడని అనుమానాలు

కోహెడ ఆగస్టు 7 : కోహెడ మండలం వరికోలులో ఓ వ్యక్తిని బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరికోలు గ్రామానికి చెందిన ఎండీ. ఫకీర్‌నబీ (45) హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లి ఊదువేస్తూ వచ్చిన డబ్బుతో నిత్యం తాగొచ్చి కుటుంబీకులను వేధిస్తుండేవాడు. అయితే కూతురు వివాహం కావడంతో భార్య, కొడుకు హైదరాబాద్‌కు బతుకుదెరువు కోసం వెళ్లారు. వారు ఉంటున్న ఇంటికి వెళ్లి అక్కడ కూడా గొడవ పడేవాడు. ఈ క్రమంలో అతన్ని దూరం పెట్టారు. అయినా కూడా అప్పుడప్పుడు వెళ్లి వారిని ఇబ్బందులకు గురిచేసేవాడు. గ్రామానికి మూడు, నాలుగు నెలలకొకసారి వచ్చి వెళ్తుండేవాడు. బుధవారం ఉదయం వరికోలు శివారులో గుర్తుతెలియని వ్యక్తులు ఫకీర్‌నబీని రాళ్లతో దాడి చేసి దారుణంగా హతమార్చారు. హత్య చేసిన ప్రాంతం నుంచి కొద్దిదూరంలో శవాన్ని పడేసి దుండగులు పారిపోయారు. రక్తపు మడుగులో పడి ఉన్న శవాన్ని గమనించిన స్థానికులు కోహెడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కన్న తండ్రి వేధింపులు తాళలేకనే కుమారుడే హతమార్చి ఉంటాడని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలానికి హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ తిరుపతి హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను పిలిపించి వివరాలు సేకరించారు. తండ్రి పెట్టే హింసలు భరించలేక కన్న కొడుకే హతమార్చి పోలీసుల వద్ద లొంగిపోయినట్లు సమాచారం. పూర్తి వివరాలకు విచారిస్తున్నట్లు తెలిసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

మెదక్ జిల్లా హవేలీఘనపూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్ జూలై 8వ తేదీన రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ యజమానిని లంచం డిమాండ్ చేయడమే ఇందుకు కారణం.

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం ఎస్ఐ శివకుమార్‌ను ఈనెల 1వ తేదీన సస్పెండ్ చేశారు. విధుల్లో క్రమశిక్షణ రాహిత్యంగా వ్యవహరించడంతోపాటు అవినీతి ఆరోపణలు వచ్చాయి. బాధితుల ఫిర్యాదులపై విచారణ చేపట్టిన అనంతరం సస్పెండ్ చేస్తున్నట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు.

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలానికి సంబంధించిన ఓ భూవివాదంలో జోక్యం చేసుకొని భూపత్రాలు దగ్గర పెట్టుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకట కిషోర్ ఏసీబీకి చిక్కాడు. సస్పెండ్ అయినప్పటికీ రూ. కోటిన్నర లంచం అడిగి రూ.5లక్షల తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని ఇద్దరు కానిస్టేబుళ్లు ఓ ఫిర్యాదుదారుడి వద్ద డబ్బు తీసుకున్నట్లుగా ఆరోపణలు రావడంతో విచారణ జరిపి జూలై 24న ఎస్పీ సస్పెండ్ చేశారు.

సిద్దిపేట టూటౌన్‌లో కానిస్టేబుల్ రవీందర్ ఇసుక లారీలు, ట్రాక్టర్ల వద్ద డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న విషయంపై విచారణ జరిపారు. నిజమని తేలడంతో జూన్ 24న సీపీ అనురాధ సస్పెండ్ చేశారు.



ఖాకీల కక్కుర్తి

పోలీసు శాఖపై అవినీతి ఆరోపణలు

- చర్యలు చేపడుతున్నా మారని వైనం
- భూతగాదాలు, సెటిల్మెంట్లలో జోక్యం
- అక్రమ దందాల్లోనూ మామూళ్ల పర్వం
- ఏసీబీ, ఉన్నతాధికారుల యాక్షన్
- ఇటీవల వెలుగు చూస్తున్న ఘటనలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఆగస్టు 7 : ఉమ్మడి జిల్లాలోని పోలీసు శాఖను అప్రతిష్ఠకు గురిచేసేలా కొంతమంది అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. సిద్దిపేట సీపీ, మెదక్, సంగారెడ్డి ఎస్పీలు అవినీతి, అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపుతున్నా, పలువురు సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్ల చర్యలు శాఖకు కళంకం తీసుకొస్తున్నాయి. దీనికి ఇటీవల చోటుచేసుకున్న ఘటనలే నిదర్శనం.

అవినీతికి అలవాటుపడుతూ..

మార్గదర్శకులుగా నిలవాల్సిన పోలీసులే దారి తప్పుతున్నారు. కొంతమంది మూలంగా అందరికీ చెడ్డపేరు వస్తోంది. ఫిర్యాదులు రాగానే ఎంత గిట్టుబాటు అవుతుందో చూసుకునేవారూ లేకపోలేదనే విమర్శలున్నాయి. కొందరైతే ఇరువర్గాల నుంచి డబ్బు ఆశిస్తున్న పేరుంది. మద్యం దుకాణాలు, ఇసుక అక్రమ రవాణా, బెల్టుషాపులు, అక్రమ బియ్యం వ్యాపారాల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకునే వాళ్లు పలుచోట్ల ఉన్నారు. కేసులను తప్పుదారి పట్టించడం, చార్జీషీట్లలో పేర్లను తొలగించడం, స్టేషన్ బెయిల్ తదితర వ్యవహారాల్లోనూ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సివిల్ పంచాయతీల్లో జోక్యం చేసుకోరాదనే నిబంధన ఉండగా, క్రిమినల్ కేసులుగా నమోదు చేసి పరిష్కరించే బాధ్యతను మీదేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అక్కడ ఇస్తూ.. ఇక్కడ పుచ్చుకుంటూ

సమర్థవంతమైన ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలు ఉన్నప్పటికీ అధికార పార్టీ నేతలు చెప్పినవారికే పోస్టింగులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉన్నతాధికారులకు దాపురించింది. మంచి పోలీస్‌స్టేషన్ పోస్టింగ్ కావాలంటే సదరు నేతలకు ఎంతో కొంత ఇచ్చుకోవాల్సిందేనన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ పెట్టిన పెట్టుబడితోపాటు లాభం పొందాలంటే అందని కాడికి దండుకోవడమే ఉపాయంగా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారు. పోస్టింగుల విషయంలో జిల్లా ఉన్నతాధికారులు సైతం పూర్తిస్థాయిలో ప్రభావం చూపలేకపోతున్నారు. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో పోలీస్ ఉన్నతాధికారులు ఇచ్చిన పోస్టింగులపై అధికార పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. తమకు తెలియకుండా ఏ ఒక్కరూ పోస్టింగ్ తెచ్చుకోవద్దనే స్థాయిలో అల్టిమేటం జారీ చేస్తున్నట్లుగా సమాచారం. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలోనూ జరిగిన పలు బదిలీల్లో అధికార పార్టీ నేతల హస్తం లేకపోలేదు.

హెచ్చరించినా మారకుండా

మెదక్ నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఉదయ్‌కుమార్‌రెడ్డి వచ్చీరావడంతోనే అవినీతి రహితంగా సేవలందించాలని సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్లను ఆకస్మిక తనిఖీలు చేస్తూ హెచ్చరిస్తున్నారు. సిద్దిపేట సీపీ అనురాధ సైతం నిత్యం టెలీకాన్ఫరెన్స్‌లలో సిబ్బందిని హెచ్చరిస్తుంటారు. అవినీతితోపాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై అనేక చర్యలు తీసుకున్నారు. సంగారెడ్డి ఎస్పీ రూపేష్ కూడా ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తుంటారు. అక్రమ దందాలపైనా నిఘా ఉంచారు. మూడు జిల్లాల్లోనూ ఉన్నతాధికారుల నిశిత దృష్టి ఉన్నప్పటికీ కిందిస్థాయిలో కొంతమంది అవినీతికి పాల్పడుతుండడం గమనార్హం.

పోలీసుల మరిన్ని ఆగడాలు

- మెదక్ జిల్లాలో ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్ వదిలిపెట్టేందుకు స్టేషన్ రైటర్ సురేందర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఇదే కేసులో ఎస్ఐ అమర్, కానిస్టేబుల్ బాసిత్ డబ్బు తీసుకున్నట్లు రుజువు కావడంతో అప్పటి ఎస్పీ బాలస్వామి వారిని సస్పెండ్ చేశారు.
- దుబ్బాక పరిధిలోని ఓ ఎస్ఐపై తాజాగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఆ స్టేషన్ నుంచి వచ్చిన పిటీషన్లను నాన్చడం, ఎఫ్ఐఆర్‌లు చేయడంలో జాప్యం చేయడం, ఫిర్యాదుదారులతో అమర్యాదగా ప్రవర్తించారనే ఆరోపణలు ఉన్నాయి.
- కుటుంబ కలహాల నేపథ్యంలో కొమురవెల్లి ఎస్ఐ భార్య అదే పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేయడంతో ఎస్ఐ నాగరాజును సస్పెండ్ చేశారు.
- ఇసుక అక్రమ రవాణా, సివిల్ తగాదాల్లో జోక్యంపై సిద్దిపేట రూరల్ సర్కిల్ పరిధిలో పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అట్రాసిటీ కేసులపై అధికారులు వేగంగా స్పందించాలి

- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సిద్దిపేట అగ్రికల్చర్ ఆగస్టు 7 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనపుడు బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పోలీసు, ఇతర శాఖ అధికారులు వేగంగా స్పందించాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు, జిల్లాలో అట్రాసిటీ కేసులు, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఇతర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వాటిలో లబ్ధి చేకూర్చిన కేసుల వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, హాస్టళ్ల గురించి కలెక్టర్ మనుచౌదరి, ఎస్పీ అనురాధ వివరించారు. అనంతరం బక్కి వెంకటయ్య మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం బాధితులకు న్యాయం అందించాలని, ఎస్సీ, ఎస్టీలపై దాడులను చేయడానికి భయపడేలా పోలీస్‌శాఖ వ్యవహరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు. కొత్తగా వచ్చిన 41 సీఆర్‌పీ చట్టం వల్ల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, విచారణకు ఇబ్బంది కలుగకుండా చూడాలని త్వరలోనే ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలుస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా హాస్టళ్లో, గురుకులాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. హాస్టల్లో ప్రవేశం కోరిన విద్యార్థులకు తప్పకుండా చేర్పించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో దాడులు జరగకుండా కఠినంగా వ్యవహరిస్తామని దాడి చేసిన వారికి త్వరగా శిక్ష పడి, బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ సూచించిన అన్ని అంశాలపై చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు ప్రవీణ్‌కుమార్, కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కవిత, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి శ్రీరాంరెడ్డి, సిద్దిపేట గజ్వేల్, హుస్నాబాద్ ఏసీపీలు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు, ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



కలెక్టర్‌తో కలిసి ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆయిల్‌పామ్ సాగుచేసేలా రైతులను చైతన్యం చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 7 : ఆయిల్‌పామ్‌ను సాగుచేసేలా రైతులను చైతన్యం చేస్తున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో రైతు లావుడ్య వీరన్ననాయక్ వ్యవసాయ భూమిలో కలెక్టర్ మనుచౌదరితో కలిసి ఆయిల్‌పామ్ మొక్కలు నాటి మాట్లాడారు. రైతు వీరన్న తనకున్న 30 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తుండటం హర్షణీయమన్నారు. ఎకరానికి ఖర్చులు పోను రూ. లక్ష మిగులుతాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెబుతున్నారని వెల్లడించారు. ఈ సంవత్సరం జిల్లాలో నాలుగు వేల ఎకరాల్లో సాగులక్ష్యం ఉందన్నారు. అలాగే హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెగ్యులర్‌గా తరగతులు జరుగుతున్నాయా.? మెను ప్రకారం ఆహారం పెడుతున్నారా.? ఆహారం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగారు. జాతీయ స్థాయిలో హ్యాండ్ బాల్, త్రోబాల్, డ్రాయింగ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ రైతు వేదికలో వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై నిర్వహించిన అవగాహన సదస్సులోనూ మంత్రి పొన్నం మాట్లాడారు. హుస్నాబాద్ కరువు పీడిత ప్రాంతమని, కరువులో రైతులను ఆదుకునేందుకు పాడి పరిశ్రమ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మీర్జాపూర్ క్లస్టర్ పరిధిలో రైతుల నుంచి గొర్రెల పెంపకం కోసం 25 దరఖాస్తులు, నాటు కోళ్ల పెంపకానికి 4, చేపల పెంపకానికి 2, ఆయిల్ పామ్ సాగుకు 7 దరఖాస్తులు, వచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ మనుచౌదరి, హార్టికల్చర్ అధికారి సువర్ణ, ఆర్డీవో రామ్మూర్తి, రైతు వీరన్ననాయక్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లస్టర్ లెవల్ అథ్లెటిక్ క్రీడాపోటీలు ప్రారంభం

వర్గల్, ఆగస్టు 7 : వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ లెవల్ అథ్లెటిక్ మీట్‌లో భాగంగా బుధవారం క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజు క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. రన్నింగ్, హర్డిల్స్, హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్, షాట్ పుట్, జావెలిన్ త్రో, డిస్కస్, వాకింగ్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలైన ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, మహబుబ్‌నగర్, వరంగల్ జిల్లాల నుంచి అండర్ 14, 17, 19 విభాగాల నుంచి 110 మంది విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

నవోదయ విద్యాలయంలో సీటు సాధించడమే ఒక గొప్ప వరమన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలని, విద్యాలయానికి, గురువులకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజు కోరారు. అనంతరం ప్రిన్సిపాల్ రాజేందర్ మాట్లాడారు. రెండురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు ఈనెల 12, 13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూర్ జిల్లా నవోదయ విద్యాలయంలో జరిగే రీజియన్ లెవల్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు.

జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమాలు: సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 7: సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రతినెలా మొదటి బుధవారం సైబర్ జాగృక్త్ దివాస్ పేరుతో జిల్లావ్యాప్తంగా వివిధరకాల సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ సైబర్ క్రైం అనేది ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య అని, సైబర్ నేరాల గురవుతున్న వాళ్లలో అధికంగా విద్యావంతులే ఉండటం దురదృష్టకరమని అన్నారు.

స్థానికతపై జీవో 33 సమగ్రంగా లేదు

- కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో తెలంగాణ బిడ్డలకు నష్టం
- కేంద్రం గ్రామాలకు ఇచ్చిన నిధులను దారి మళ్లించారు: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు తెలంగాణ బిడ్డలకు నష్టం కలిగిస్తున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎంబీబీఎస్ అడ్మిషన్ల విషయంలో జారీ చేసిన జీవో 33 సమగ్రంగా లేదని, తెలంగాణ బిడ్డలే నాన్ లోకల్ అవుతున్నారన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కారు గుడ్డెద్దు చేలో పడ్డట్టు వ్యవహరిస్తోందన్నారు. 2024 జూన్ 2 నాటికి తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తికావడంతో స్థానికత నిర్ధారణకు సొంత నిబంధనలు రూపొందించుకోవడానికి రాష్ట్రానికి అవకాశం దక్కిందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బిడ్డలకు విద్యా సంస్థల్లో ప్రవేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఆలోచన చేసి, నిబంధనలు తయారు చేయాల్సి ఉండగా.. అలాంటిదేం లేకుండా ఎంబీబీఎస్ అడ్మిషన్ల కోసం 33 జీవో తెచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ అంశంలోనూ సరిగా అవగాహన లేదని, అందుకే 9 నుంచి 12వ తరగతి వరకు ఎక్కడ చదివితే దాన్నే స్థానికతగా నిర్ణయిస్తూ జీవో తెచ్చిందన్నారు. దీని వల్ల తెలంగాణ బిడ్డలు స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉందన్నారు. కేసీఆర్ హయాంలో 95 శాతం స్థానికులకు ఉద్యోగాలు దక్కేలా విధానాలు తెచ్చారని, అదే పద్ధతి విద్య విషయంలోనూ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వచ్చాక ఏర్పాటుచేసిన వైద్య కళాశాలల్లో స్థానికేతర విద్యార్థులకు రిజర్వేషన్ అమలు చేయలేదని, స్థానికులకే సీట్లు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస నిధులైనా ఇవ్వకపోతే పంచాయతీలు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ఎలా నిర్వహిస్తాయని ప్రశ్నించారు. ఉపాధి హామీ, ఆరోగ్య మిషన్ వంటి పథకాల కింద కేంద్రం ఇచ్చిన రూ.2100 కోట్లను గ్రామాలకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించిందని, దీంతో కేంద్రం నుంచి రావాల్సిన మరిన్ని నిధులకు బ్రేక్ పడిందన్నారు. కాంగ్రెస్ పాలన చేపట్టిన 8 నెలల్లో పంచాయతీలకు పైసా కూడా ఇవ్వలేదన్నారు.

గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో 235 వైద్య పోస్టుల భర్తీ

- రేపు వాకిన్ ఇంటర్వ్యూల నిర్వహణ

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్నా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఈమేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 235 మంది వైద్యుల పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఉస్మానియా వైద్య కళాశాలలో ప్రొఫెసర్ పోస్టులు-8, అసోసియేట్ ప్రొఫెసర్-23, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-111, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-33 ఉన్నాయి. గాంధీలో ప్రొఫెసర్ పోస్టులు-3, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-29, సీనియర్ రెసిడెంట్స్-24, ట్యూటర్లు-4 పోస్టులున్నాయి. ఈ పోస్టులను వాకిన్ ఇంటర్వ్యూ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఈమేరకు 9న ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. 12న ధ్రువపత్రాల పరిశీలన, 13న అభ్యంతరాల స్వీకరణ, 14న ఎంపిక ప్రక్రియ ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలను గాంధీ మెడికల్ కాలేజీలో వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కాలేజీలో తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ సమక్షంలో నిర్వహించనున్నారు. ఈ నియామకాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నియామకాలు పారదర్శకంగా జరిగేలా హైదరాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఎంఈ, టీవీపీపీ కమిషనర్‌లను నోడల్ అధికారులుగా నియమిస్తూ సర్కారు జీవో జారీ చేసింది.



ఆ ఆస్పత్రుల్లో వైద్యులు పెరిగారు

కాగా వైద్య ఆరోగ్యశాఖలో ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీలతో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత నెలకొందన్న వార్తల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ దానిపై స్పష్టతనిచ్చింది. దీర్ఘకాలం ఒకే చోట ఉన్న వారిలో 40 శాతం మందిని బదిలీ చేయాలని జీవో 80 చెబుతోందని, ఆ మేరకే బదిలీలు చేపట్టామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. బదిలీలతో గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ప్రభావం లేదని, ఆ రెండింట్లో గతం కంటే వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఉన్నారన్నారు. ఉస్మానియాలో గతేడాది 169 మంది డాక్టర్లు, 247 మంది నర్సులుంటే... ప్రస్తుతం 266 మంది వైద్యులు, 263 నర్సులున్నారని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఇక గాంధీలో ఇంతకు ముందు 295 మంది డాక్టర్లు, 191 మంది నర్సులుండగా...ప్రస్తుతం 362 మంది వైద్యులు, 287 మంది నర్సులున్నారని వెల్లడించింది.

భూముల సర్వేకు డ్రోన్లు

ప్రత్యేయ యాప్‌తో అనుసంధానం.. జియో ట్యాగింగ్‌తో ఫొటోలు

- గంటలో 100 ఎకరాల దాకా కొలతలు
- ఐఐటీ హైదరాబాద్ పరిశోధకుల రూపకల్పన
- దేశంలో తొలి సర్వే డ్రోన్‌గా గుర్తించిన కేంద్ర సర్కారు


గాల్లో ఎగురుతూ ఫొటోలు తీస్తున్న డ్రోన్

కంది, ఆగస్టు 7: భూములను గొలుసులతో కొలవడం సంప్రదాయ పద్ధతి! దీనికి మనుషులు ఎక్కువే అవసరం. సమయమూ బాగానే పడుతుంది. ఎకరం-రెండకాలను కొలిచేందుకు గంటకు పైగా పడుతుంది. డిజిటల్ యంత్రాలు వచ్చేశాయ్.. కాబట్టి మనుషులు తక్కువ అవసరం.. సమయమూ కొంత తగ్గింది! మరి.. ఒకే ఒక గంటలో 100 ఎకరాల భూమిని సర్వే చేయగలిగేలా వ్యవస్థ ఏదైనా అందుబాటులోకొస్తే? అద్భుతమే కదా! ఆ వ్యవస్థ వచ్చేసింది. అదే.. డ్రోన్లద్వారా భూ సర్వే పద్ధతి! సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పరిశోధకులు భూములను సర్వే చేసేందుకు ప్రత్యేక డ్రోన్లను రూపొందించారు. ఈ డ్రోన్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టడానికి ఐఐటీ-హెచ్‌లోని ఇంక్యుబేషన్ విభాగం అధికారులు క్రిస్టల్‌బాల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్యంతో స్టార్టప్ కంపెనీ ప్రారంభించారు. ఈ డ్రోన్‌లను డీజీసీఏ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) అంగీకరించింది. భూముల సర్వేలో దీని పనితీరు పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఈ డ్రోన్లను సర్వే డ్రోన్లుగా గుర్తించింది. ఫలితంగా దేశంలోనే తొలి సర్వే డ్రోన్‌గా గుర్తింపు పొందింది. మోడల్-వీ పేరుతో తయారుచేసిన ఈ డ్రోన్లు సెకండ్‌కు 8 మీటర్లు ఎత్తుకు ఎగురుతాయి. ఒకసారి చార్జింగ్ చేస్తే 50 నిమిషాల పాటు గాలిలోనే ఎగరగల సామర్థ్యంతో వీటిని తయారు చేశారు. భూ సర్వేపై రూపొందించిన ఓ ప్రత్యేక యాప్‌ను అనుసంధానం చేస్తే గాల్లోకి ఎగిరి జియో టాగింగ్‌తో ఫొటోలు తీసి సర్వే హద్దుల వివరాలను పక్కాగా వెల్లడిస్తుంది. ఈ డ్రోన్ల తయారీ కోసం 32మంది ఏరోనాటికల్ ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్యోగులుగా నియమించుకున్నారు. ఈ డ్రోన్లతో భూ సర్వేలు అత్యంత వేగంగా చేయవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. వీటితో పాఠశాల విద్యార్థులకు వివిధ రకాలుగా పాఠ్యాంశాలు కూడా బోధించవచ్చునని తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం రెండు నెలల క్రితం ఇదే స్టార్టప్ కంపెనీ ద్వారా 100 డ్రోన్లను కొనుగోలు చేసింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఈ సర్వే డ్రోన్లు 300 వరకు అమ్ముడయ్యాయని తెలిసింది. అతి త్వరలోనే గాల్లో గంటసేపు ఎగిరే సామర్థ్యంతో పంట పొలాల్లో మందులు పిచికారి చేసే డ్రోన్లు, సర్వేలెన్స్ డ్రోన్లు అందుబాటులోకి రానున్నాయని పరిశోధకులు వెల్లడించారు. మంగళవారం సంగారెడ్డి పరిధిలోని కందిలో ఈ డ్రోన్లను ఐఐటీ-హెచ్ స్టార్టప్ కంపెనీ ఉద్యోగులు గాల్లోకి ఎగరవేసి వాటి పనితీరును పరీక్షించారు.

డ్రోన్లతో సర్వే ఇలా..

భూ సర్వే కోసం తొలుత ఈ డ్రోన్‌లకు మొబైల్ ఫోన్‌లో 'మిషన్ ప్లానర్' లేదా 'ల్యాండ్ మెజర్‌మెంట్' యాప్‌లను అనుసంధానం చేయాలి. తర్వాత స్థలం యజమాని చూపించే భూమి హద్దులను బట్టి ఆ యాప్ ద్వారా ఒక బెంచ్ మార్కును గీస్తారు. ఆ యాప్‌లోని కేఎంఎల్ (కీహోల్ మార్కప్ లాంగ్వేజ్) ద్వారా హద్దులను గుర్తించి సర్వే చేయాలనుకున్న ప్రదేశాన్ని మొత్తం చతురస్రాకారంలో ఒక రూట్ మ్యాప్ తయారు చేస్తారు. ఆ మ్యాప్‌తో డ్రోన్‌ని గాల్లోకి వదులుతారు. కేఎంఎల్ ఆధారంగా ఆ డ్రోన్ తీసే ఫొటోలకు మిషన్ ప్లానర్ యాప్‌లో గూగుల్‌లోని సర్వే ప్రదేశం ఉన్న విలేజ్ మ్యాప్‌ను అనుసంధానం చేసి రిపోర్ట్ ఇస్తారు. ఈ సాంకేతికతతో గంటకు 100 ఎకరాలు సర్వే చేయవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. ఈ డ్రోన్లతో భూముల సర్వేతో పాటు కొండలు, గుట్టలు, బురద ప్రాంతాలు, నీటి కుంటలు లాంటి ప్రదేశాల్లో సులువుగా కొలతలు తీయొచ్చు. డ్రోన్ కెమెరాల్లో వాడే కెమెరా మ్యాన్యువల్‌ను బట్టి మైనింగ్‌లలో, పవర్ ప్లాంట్లు, రైల్వే ట్రాక్ కూడా సర్వే చేయొచ్చునని వారు తెలిపారు.

గత సర్కారు నిర్వాకంతో పంచాయతీలకు ఇక్కట్లు

- మీ హయాంలో సర్పంచుల ఆత్మహత్యలు చేసుకున్నారు..
- హరీశ్ మర్చిపోయారా?: మంత్రి సీతక్క



హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్వాకంవల్లే గ్రామ పంచాయతీలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే హక్కు వారికి లేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో కనీసం పాల్గొనకుండా రాజకీయాలు చేయడం హరీశ్‌రావుకు తగదన్నారు. 'పదే పదే అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మరు. మీ ప్రభుత్వ హయాంలోనే సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్న విషయం మర్చిపోయారా?' అని నిలదీశారు. ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను బుధవారం మంత్రి సీతక్క ఓ ప్రకటనలో ఖండించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రూ.10,170 కోట్లు కేటాయించి రూ.5,988కోట్లే విడుదల చేసిందన్నారు. పంచాయతీలకు 44శాతం నిధులివ్వకుండా గత ప్రభుత్వం సొంత అవసరాలకు వాడుకుందని ఆరోపించారు. నేషనల్ రూర్బన్ (రూరల్ అర్బన్) మిషన్‌కు 2019 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయేనాటికి రూ.1,200 కోట్లు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేయించిన పనులకు సంబంధించి ఆరేళ్లుగా రూ.940 కోట్లు, రూరల్ ఇంజనీరింగ్ విభాగానికి రూ.600కోట్ల బిల్లులు చెల్లించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 నూతన పంచాయతీ చట్టం ద్వారా అడ్వర్టైజింగ్, మైనింగ్ వంటి పన్నులను పంచాయతీలకు రాకుండా చేసిందని, పంచాయతీలను ఆదుకోకపోగా ఆర్థికంగా మరింత దెబ్బతీశారని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల ప్రకారం పంచాయతీలకు నిధులు కేటాయించలేదన్నారు. కేసీఆర్ జన్మదినం కోసం ఫిబ్రవరిలో మొక్కలు నాటించారని విమర్శించారు. కాగా మూడు రోజుల్లోనే 25 లక్షల మొక్కలు నాటించామని, 29 వేల కిలోమీటర్ల రహదారులు, 18 వేల కిలోమీటర్లకుపైగా డ్రైనేజీ కాలువలను శుభ్రపరిచామని, ఇది బీఆర్ఎస్ నేతలకు కనబడటంలేదని సీతక్క పేర్కొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత: భారతి హోళికేరి


జప్తిసింగాయపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న భారతి హోళీకేరి

ములుగు/గజ్వేల్/సిద్దిపేట టౌన్/రాయికోడ్, ఆగస్టు 7: భావితరాల భవిష్యత్ కోసం మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత ప్రతీఒక్కరు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ప్రత్యేకాధికారి భారతి హోళికేరి అన్నారు. బుధవారం ములుగు మండలం జప్తిసింగాయపల్లి గ్రామాన్ని ఆమె సందర్శించి, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీవో దేవకీదేవి, డీఆర్డీవో పీడీ జయదేవ్, ఎంపీడీవో కేవీఆర్.శర్మ పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులను దూరం చేయడానికే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఉమ్మడి మెదక్ జిల్లా స్వచ్ఛదనం-పచ్చదనం ప్రత్యేకాధికారి, ఆర్కియాలజీ విభాగం కార్యదర్శి భారతి హోళికేరి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో ఫీవర్ సర్వే, గజ్వేల్ మండలం బయ్యారం గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆమెవెంట డీఆర్డీవో జయదేవ్ ఆర్య, డీపీవో దేవకీదేవి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి ఎంపీడీవో ప్రవీణ్ పాల్గొన్నారు. స్వచ్ఛ బడి కోసం అరెకరం స్థలం ఇస్తేనే.. ఇంత అద్భుతంగా నిర్వహణ జరుగుతుందని, పది ఎకరాలు ఇస్తే ఇంకా అద్భుతంగా నిర్వహణ చేసేలా ఉన్నారని కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) జాయింట్ డైరెక్టర్ నారాయణరావు నిర్వాహకులను అభినందించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం పరిశీలన కోసం ఉమ్మడి మెదక్ జిల్లాకు ప్రత్యేకాధికారిగా నారాయణరావును ప్రభుత్వం నియమించింది. దీంతో సిద్దిపేట పట్టణంలోని రెవెన్యూ, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామ ప్రత్యేకాధికారులదేనని రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ అన్నారు. బుధవారం మండల రాయికోడ్ పరిధిలోని నల్లంపల్లి, మహ్మదాపూర్, పిప్పడ్‌పల్లి, గ్రామాల్లోని వన నర్సరీలను, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో అమృత, ఎంపీడీవో ఎంఎం.షరీఫ్, ఎంపీవో అంజలీదేవి, మండల అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 25,812 మంది రైతులకు రుణమాఫీ: డీసీసీబీ ఏజీఎం

వెల్దుర్తి, ఆగస్టు 7: ఉమ్మడి మెదక్ జిల్లాలోని డీసీసీబీలో 25,812 మంది రైతులకు రుణమాఫీ జరిగిందని డీసీసీబీ ఏజీఎం, వెల్దుర్తి నోడల్ అధికారి రమేష్ తెలిపారు. బుధవారం వెల్దుర్తి డీసీసీబీలో జరిగిన రుణమాఫీ పంపిణీలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో 25,812 మంది రైతులకు రెండు విడతల్లో రూ.125.65 కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. వెల్దుర్తి బ్రాంచ్‌లో రెండు విడతల్లో 949 మంది రైతులకు రూ.3 కోట్ల 76లక్షల రుణమాఫీ జరిగిందని, రుణమాఫీ జరిగిన వారిలో 209 మంది రైతులకు రూ.కోటి 38 లక్షలు పంపిణీ చేశామని ఆయన వివరించారు. డీసీసీబీలో అసైన్డ్ భూములు ఉన్న రైతులకు కేవలం పంటల రుణమాలు మాత్రమే ఇస్తున్నామని, అది కూడా వారితో సెల్ఫ్ డిక్లరేషన్ రాయించుకుని ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, వెల్దుర్తి డీసీసీబీ మేనేజర్ రవీందర్, సొసైటీ సీఈవో సిద్ధయ్య పాల్గొన్నారు.

కన్నప్రేమను మరిచి రోకలిబండతో కొట్టి...

- మానసిక వికలాంగుడైన కొడుకును చంపిన తండ్రి
- మద్యం మత్తులో ఘాతుకం


ప్రదీప్(ఫైల్)

పెద్దశంకరంపేట, ఆగస్టు 7: కొడుకు మానసిక వైకల్యాన్ని కన్నతండ్రే భరించలేకపోయాడు. కన్నకొడుకు అనే మమకారం కూడా లేకుండా మద్యం మత్తులో రోకలిబండతో కొట్టి ప్రాణం తీశాడు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో ఈ దారుణం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దశంకరంపేట ఇందిరా కాలనీకి చెందిన పిరయిల సాయిలు, భాగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడికి వివాహమవ్వగా భార్యతో కలిసి వేరుగా ఉంటున్నాడు. చిన్నకుమారుడు ప్రదీప్(16) మానసిక వికలాంగుడు కావడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులే ప్రదీప్ ఆలనాపాలన చూస్తుంటారు. ప్రదీప్‌కు ప్రభుత్వం నుంచి వికలాంగ పింఛను కూడా వస్తోంది. అయితే, ప్రదీప్ మానసిక వైకల్యాన్ని తండ్రి సాయిలు భరించలేకపోతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికొచ్చిన సాయిలు రోకలిబండతో ప్రదీప్‌ను కొట్టాడు. దీంతో ప్రదీప్ అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

హవేళిఘణపూర్, ఆగస్టు 7: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ బుధవారం మృతిచెందాడు. మండలంలోని ఫరీద్‌పూర్‌తండాకు చెందిన బానోత్ దుర్గపతి(50) మెదక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు తన బైక్‌పై వెళ్లాడు. కూచన్‌పల్లి శివారులోని మగ్దుంపూర్ రోడ్డు వద్ద కుక్కలు అడ్డురావడంతో బ్రేక్ వేసి కిందపడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబీకులు మెదక్ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ రాజు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కాగా దుర్గపతి పార్థీవదేశానికి ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయం కింద రూ.20 వేలు అందజేశారు.

మరో ఘటనలో వ్యక్తి..

చేర్యాల, ఆగస్టు 7: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన మాదాసు శ్రీహరి(31) ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సైట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీహరి సెల్‌ఫోన్ చెడిపోవడంతో రిపేర్ కోసం చేర్యాలలోని బంధువైన దొమ్మాట నవీన్‌కు అందించాడు. మంగళవారం రాత్రి సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లేందుకు బావమరిది రాజుతో కలిసి బైక్‌పై చేర్యాలకు వచ్చాడు. ముగ్గురూ కలిసి ముస్త్యాలకు వెళ్లి బర్త్‌డేలో పాల్గొన్నారు. విందు అనంతరం ఇంటికి తిరిగి వెళ్తుండగా.. చేర్యాల పట్టణ శివారులోని కల్వర్టు వద్ద కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. శ్రీహరికి తీవ్రగాయాలు కావడంతో సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కొమురవెల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

జహీరాబాద్, ఆగస్టు 7: ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. న్యాల్‌కల్ మండలం మండలం రాంతీర్థకు చెందిన చాకలి సిద్ధన్న కూతురు తేజస్విని, భార్య అంబికతో కలిసి బైక్‌పై కర్ణాటకలోని మన్నెక్కెల్లిలో గల ఓ బ్యాంకులో పనులను పూర్తి చేసుకుని జహీరాద్ వైపు వస్తున్నారు. సత్వార్ సమీపంలో జాతీయ రహదారిపై (టీజీ 08-0337) నంబరు గల బైక్ వేగంగా వచ్చి ముందు వెళ్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో అంబిక అక్కడికక్కడే మృతిచెందింది. కూతురు, భర్తకు స్వల్పగాయాలయ్యాయి. సిద్ధన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మిషన్ భగీరథ కట్వాల్‌ను ఢీకొన్న ఆటో, డ్రైవర్ మృతి

కొల్చారం, ఆగస్టు 7: కొల్చారం మండలం రంగంపేట వైపు నుంచి మెదక్ వైపు వెళ్తున్న ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మిషన్ భగీరథ కట్వాల్‌ను ఢీకొట్టడంతో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన కొల్చారం మండలం వరిగుంతం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చోటు చేసుకున్నది. కొల్చారం ఏఎస్‌ఐ తారాసింగ్ వివరాల ప్రకారం.. టేక్మాల్ మండలం అసన్‌పల్లికి చెందిన శంకరయ్య(38) ఆటో మరమ్మతుల కోసం రంగంపేట మీదుగా మెదక్‌కు వెళ్తున్నాడు. వరిగుంతం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆటో అదుపు తప్పి రోడ్డుకు అవతలి వైపు ఉన్న మిషన్ భగీరథ కట్వాల్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్ శంకరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసత్రికి తరలించినట్లు తెలిపారు.

దోపిడీ ఘటనలో ముగ్గురి అరెస్టు

తూప్రాన్, ఆగస్టు 5: దోపిడీ ఘటనలో ముగ్గురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివానందం వివరించారు. హైదరాబాద్ కొంపెల్లికి చెందిన అమీన్ అబ్దుల్ లలాని మసాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. జూలై 9న నిజామాబాద్‌లో ఇమ్రాన్ వద్ద కలెక్షన్ డబ్బులు రూ.5 లక్షలు తీసుకుని నిజామాబాద్ నుంచి రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో కొంపెల్లికి బయలుదేరాడు. తూప్రాన్ పట్టణ శివారు హైవే బైపాస్‌లో వినోద్ దాబా హోటల్ వద్ద రాత్రి 8.50 గంటలకు డ్రైవర్ బస్సును నిలిపాడు. అమీన్ అబ్దుల్ లలాని డబ్బున్న బ్యాగులో సీటుపై పెట్టి భోజనం చేసేందుకు బస్సు దిగాడు. అదే సమయంలో బస్సులో ఉన్న రూ.5 లక్షలు బ్యాగు దోపిడీ జరిగింది. ఈ కేసుకు సంబంధించి మహారాష్ట్రకు చెందిన సురజ్ పండిట్ గుంజాల్ డికొలే, సంతోష్ సాయబ్‌రావు డికోలే, సునీల్ అర్జున్‌జాదవ్‌లను అరెస్టుచేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు సునిల్ పండిట్ గుంజాల్ డికోలే పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితుల వద్ద కారు, మొబైల్ ఫోన్ సీజ్ చేసినట్లు వివరించారు.

మహిళను చంపేందుకు కుట్ర

నర్సాపూర్, ఆగస్టు 7: ఒంటరి మహిళపై పెట్రోల్ పోసి హత్య చేయాలని గుర్తు తెలియని దుండగులు కుట్ర పన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంటకు చెందిన లక్ష్మి మంగళవారం రాత్రి ఇంట్లో కిటికీ పక్కనే మంచంపై పడుకుని ఉన్నది. రాత్రి 2 గంటల తర్వాత కిటికీలో నుంచి పెట్రోల్ పోయగా.. ఆమెపై పడింది. ఇంతలోనే పెట్రోల్ పోసినవారు మంట అంటించడంతో మంచంపై బెడ్‌షీట్ తగులబడిపోయింది. వెంటనే ఆమె పక్కకు జరగడంతో ప్రమాదం తప్పిందని పేర్కొన్నది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపడుతున్నారు. తనకున్న ఎకరం భూమిని కాజేసేందుకే తమ సమీప బంధువులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని బాధితురాలు లక్ష్మి వాపోయింది.

యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి

నర్సాపూర్, ఆగస్టు 7: యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడిచేశాడు. నర్సాపూర్ మండలం ఆవంచ గ్రామానికి చెందిన శ్రీశైలం పొలానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడిచేసేందుకు యత్నించగా.. శ్రీశైలం అరవడంతో పారిపోయారని తెలిపారు. ఈ ఘటనలో శ్రీశైలంకు స్వల్ప గాయాలు కాగా.. కుటుంబసభ్యులు నర్సాపూర్ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

3 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

జోగిపేట, ఆగస్టు 7: మండలంలోని డాకూర్ శివారులో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మూడు కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్, మద్య నిషేధం శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని డాకూరు వాహన తనిఖీలు చేపట్టామన్నారు. వట్‌పల్లి మండలం గౌతాపూర్ వద్ద మోహియోద్దీన్ బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తుండగా తనిఖీ చేయగా.. 3.05 కిలో ఎండు గంజాయి లభించినట్లు వివరించారు. ఈ గంజాయి విలువ రూ.1.80 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. కాగా బైక్‌ను సీజ్‌చేసి, మోహియోద్దీన్‌ను అదుపులోకి తీసుకుని జైలుకు పంపించామన్నారు.

ఉద్యమ కళాకారులకు నిరుద్యోగ భృతి కల్పించండి

గుమ్మడిదల, ఆగస్టు 7: ఉద్యమ కళాకారులకు నిరుద్యోగ భృతి కరువైందని, వెంటనే కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిన్నారం, గుమ్మడిదల ఉమ్మడి కళాకారులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ విషయమై కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో పరశురాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనచైతన్య కళాసంస్థ అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ తెలంగాణ సాంస్కృతిక సారథి పర్యవేక్షణలో ఉద్యోగాల విషయంలో అన్యాయం జరిగిందన్నారు. కళాకారులు రొయ్యపల్లి రవి, ఎర్రవల్లి బాల నరసింహులు, మరిగాని యాదగిరి, పాల్గొన్నారు.


సిద్దిపేట టౌన్: పట్టణంలోని ముర్షద్‌గడ్డలో పారిశుధ్య కార్మికులతో మున్సిపల్ చైర్‌పర్సన్


మద్దూరు: ధర్మారంలో పూలమొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం సిద్ధిస్తుందని అధికారులు పేర్కొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా గురువారం గ్రామాలు, పట్టణాల్లో అధికారులు పర్యటించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


నంగునూరు: ముండ్రాయిలో మొక్కలు నాటుతున్న సిద్దిపేట జడ్పీ సీఈవో రమేష్


వర్గల్: గౌరారంలో నర్సరీలోని మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి


తొగుట: చందాపూర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి


చేర్యాల: ప్రభుత్వాస్పత్రిలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి


సిద్దిపేట టౌన్: పారిశుధ్య కార్మికులకు నమస్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పదోన్నతులు బాధ్యతను మరింత పెంచుతాయి

● పోలీస్ కమిషనర్ అనురాధ


ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారితో సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 7: పదోన్నతులు బాధ్యతను మరింత పెంచుతాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ అన్నారు. జిల్లాలో హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన ఆరుగురిని అభినందించి ఆమె మాట్లాడారు. పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. పోలీసుశాఖలో క్రమశిక్షణతో, బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలు లభిస్తాయని తెలియజేశారు, కార్యక్రమంలో అదనపు డీసీపీ యస్. మల్లారెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్ చోరీ.. డివైడర్‌ను ఢీకొట్టిన నిందితుడు


ప్రమాదంలో ధ్వంసమైన అంబులెన్స్

కొండపాక, ఆగస్టు 7: అంబులెన్స్‌ను చోరీ చేసి పారిపోతూ అతివేగంతో డివైడర్‌ను ఢీకొట్టడంతో నిందితుడికి తీవ్రగాయాలు అయ్యాయి. కొండపాకకు చెందిన నవీన్ అనే వ్యక్తి ప్రైవేటు అంబులెన్స్ సిద్దిపేటలో నడుపుతుంటాడు. అందులో భాగంగా ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద నిలిపి లోపలికి వెళ్లాడు. వాహనానికే తాళం చెవి ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తి అంబులెన్స్‌ను తీసుకుని సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు అతివేగంగా వెళ్లాడు. ముందు టోల్‌గేట్ ఉందని భావించి దొరికిపోతానని యూటర్న్ చేసుకుని మళ్లీ సిద్దిపేట వైపు వెళ్తూ దుద్దెడ శివారులో డివైడర్లకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వాహనం పూర్తిగా ధ్వంసం అయింది. చోరీకి యత్నించిన వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అతడిని టోల్‌గేట్ అంబులెన్స్‌లో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని రేబర్తికి చెందిన అశోక్‌గా గుర్తించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి కాపర్ వైరు చోరీ

కుకునూరుపల్లి, ఆగస్టు 7: ట్రాన్స్‌ఫార్మర్‌ని పగలగొట్టి కాపర్ వైర్, ఆయిల్‌ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన చిన్నకిష్టాపూర్ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకున్నది. ఎల్లయిగూడ గ్రామానికి వెళ్లే దారిలో చిన్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి అందులో ఉన్న 53 కేజీల కాపర్‌వైర్, 150 లీటర్ల ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. వీటి విలువ దాదాపు లక్ష రూపాయలుగా ఉంటుందని అంచనా ఈ దొంగతనం మంగళవారం రాత్రి జరిగినట్లు సమాచారం. కుకునూరుపల్లి మండల విద్యుత్‌శాఖ ఏఈ రాజేంద్రప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల సీజ్

నంగునూరు, ఆగస్టు 7: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఖాత పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై కేసునమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్ తెలిపారు. బుధవారం పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా ఖాతా గ్రామానికి చెందిన చల్లా సత్తిరెడ్డి, సందిటి ప్రవీణ్, పోతిరెడ్డి తిరుపతి అనే ముగ్గురు మూడు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం సీజ్

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్ తెలిపారు. హుస్నాబాద్ సిద్దిపేట రహదారిలోని నంగునూరు మండలం పాలమాకుల బస్‌స్టాప్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా టీఎస్ 36టీ4933 ట్రాలీలో ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. పట్టుకున్న వాహనాన్ని పంచనామా నిర్వహించి పోలీస్‌స్టేషన్ తరలించినట్లు తెలిపారు. డ్రైవర్ వంగ నరేష్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంటల రక్షణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎస్.శ్రీదేవి

సిద్దిపేట రూరల్, ఆగస్టు7: వరి, మొక్కజొన్న, పత్తి వంటి పంటల రక్షణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త ఎస్.శ్రీదేవి రైతులకు సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం తోర్నాల ఆధ్వర్యంలో బుధవారం శాస్త్రవేత్తల బృందం నారాయణరావుపేట, చిన్నకోడూరు మండలం మాచపూర్, తొగుట మండలం గుడికందుల గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఉమారాణి, రమాదేవి, పల్లవి, ఏవో మోహన్, ఏఈవోలు దేవేందర్, జమీల్ ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాభి సీతారామచంద్రస్వామి చల్లని చూపు ప్రజలపై ఉండాలి

● కేఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు


ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న కల్వకుంట్ల వంశీధర్‌రావు

సిద్దిపేట రూరల్, ఆగస్టు7: పట్టాభి సీతారామచంద్రస్వామి చల్లని చూపు ప్రజలపై ఉండాలని ఆ దేవుడిని కోరుకున్నానని కేఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం చింతమడక పట్టాభి శ్రీసీతారామచంద్రస్వామి ముఖద్వారాన్ని తన సొంత డబ్బులతో నిర్మాణం చేపట్టి బుధవారం సోదరుడు కన్నారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీధర్‌రావు మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ సూచన మేరకు చింతమడక అభివృద్ధికి, ఆలయం అభివృద్ధి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గ్రామానికి చెందిన వికలాంగుడికి త్రీవీలర్ ద్విచక్రవాహనాన్ని అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాలకిషన్‌రావు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ పోచంపల్లి సతీమణి

చేర్యాల, ఆగస్టు 7: కొమురవెల్లి మల్లికార్జునస్వామిని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సతీమణి పోచంపల్లి మమతరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు.


అక్కన్నపేట మండలం మైసమ్మవాగు తండా, మబ్బుకుంటతండా, బండమీదితండా, కోక్యానాయక్‌తండా, హనుమంతుతండా, రంగన్నకుంటకు వెళ్లే మట్టి రోడ్లు చినుకు పడితే బురదమయంగా మారుతున్నాయి. భారీ వర్షానికి రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. తండావాసులు తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బురద రోడ్లపై వర్షంలో తడుస్తూ నాట్లు వేసి నిరసన తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి తమ తండాలకు తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

- అక్కన్నపేట

వ్యాసరచన పోటీలు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 7: ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగానికి చెందిన చిన్నకోడూరు మండల అధ్యక్షుడు గుజ్జ రాజు, సిద్దిపేట రూరల్ మండలం అధ్యక్షుడు బండి శ్రీకాంత్, పట్టణ సమన్వయ కర్త ఇరుగంటి రమేష్, ఉపాధ్యక్షుడు రాగారం రాము, అధికార ప్రతినిధి మాదవ్, నాయకులు నాగరాజు, మైలారం వంశీ, ఆదర్శ్ గొల్లపల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీఏలు మంజూరు చేయాలి

కోహెడ, ఆగస్టు 7: ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన డీఏ బకాయిలు ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్ అన్నారు. మండలంలోని శనిగరం, తంగళపల్లి, గుండారెడ్డిపల్లి, కూరెల్ల, కోహెడ, వింజపల్లి, వరికోలు, రాంచంద్రాపూర్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బుధవారం సభ్యత్వాలను ఉపాధ్యాయులకు ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేసి ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, కోహెడ మండల అధ్యక్షుడు హరిదాస్, మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ కరీం, జిల్లా ఉపాధ్యక్షులు కొర్తివాడ రాజేందర్, మురికి శ్రీనివాస్, మోర గణేష్, రామంచ రవీందర్, వెన్న చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

55మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసు

క్రైం, ఆగస్టు 7: సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో మంగళవారం రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించిన తనిఖీల్లో జిల్లా వ్యాప్తంగా 55 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీబాబు, విద్యాసాగర్, ఉపేందర్, శ్రీను, సైదా, లతీఫ్, శ్రీనివాస్, ఎస్ఐలు, పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 35మందికి జరిమానా

గజ్వేల్, ఆగస్టు 7: మద్యం సేవించి వాహనాలు నడిపిన 35మందికి జరిమానా విధిస్తూ గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పును వెలువరించారని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి బుధవారం తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని మూడు రోజులుగా ఆయా చౌరస్తాలలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో 35మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపరచగా రూ.23,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఎస్ఐని కలిసిన నాయకులు

మద్దూరు, ఆగస్టు 7: మద్దూరుకు నూతనంగా వచ్చిన ఎస్ఐ షేక్ మహబూబ్‌ను కాంగ్రెస్ సోషల్‌మీడియా సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సోషల్‌మీడియా అధ్యక్షుడు ఎర్రబచ్చల శ్రీకాంత్, కన్వీనర్ బత్తిని రమేష్, బియ్యం రాజు, వేల్పుల అశోక్, నీల నవీన్, కాసర్ల సాయికిరణ్, చెట్కూరి రాజు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

● డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి


క్రీడా దుస్తులు అందజేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక, ఆగస్టు 7: చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని సిరసనగండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు అనంత రామారావు అందించిన ఆర్థిక సహాయంతో క్రీడా సామగ్రి, స్పోర్ట్స్ డ్రెస్‌ను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్ది విఠల్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు. సాగునీటిని విడుదల చేయాలి

'సాగుకు నీటిని విడుదల చేయాలి'

జగదేవ్‌పూర్, ఆగస్టు 7: వర్షాభావం వల్ల చాలా ప్రాంతాల్లో వరి సాగు పనులు ముందుకు సాగడంలేదని, ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో భారీ వర్షాలు లేకపోవడం వల్ల చెరువులు, కుంటలు, వాగు వంకలు బోసిపోయాయని తెలిపారు. దీంతో ఆయకట్టు సాగు భూములలో వరి సాగు పనులు ముందుకు సాగడంలేదని వివరించారు. ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం ద్వారా కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టు నింపి సాగునీరు అందించాలని కోరారు.

గజ్వేల్ చెరువు, కుంటలను నింపాలి

● బీజేపీ నాయకుల డిమాండ్

గజ్వేల్, ఆగస్టు 7: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని చెరువు, కుంటలను మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల ద్వారా నింపాలని బీజేపీ గజ్వేల్ అధ్యక్షుడు దేవుల పల్లి మనోహర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని కాళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయంలో బుధవారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలు పేరుతో ఏర్పడిన రాష్ట్రంలో నీళ్లు అందని ద్రాక్షగా మరాయన్నారు. వారితో బీజేపీ నాయకులు ఆలేటి సుమతి, వెంకట్‌రెడ్డి, వడ్డేపల్లి ప్రసాద్, నరసింహా ముదిరాజ్, దువ్వల రాజు, కుంకుమరాణి, కరుణాకర్, మంతూరి మమత, పాతూరి మమత, చింత సరిత, నరేశ్ తదితరులున్నారు.

మండల కమిషన్ అమలు దినోత్సవం

హుస్నాబాద్, ఆగస్టు 7: హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల్ కమిషన్ అమలు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివక్ష, అవమానాలు ఎదుర్కొంటున్న బీసీలు మండల కమిషన్ ద్వారా ఆత్మగౌరవాన్ని నిలుపుకోగలిగామని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, జేఏసీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, వడ్డెపల్లి మల్లేశం, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ఎండీ. హసన్, గొర్ల అయిలేష్‌యాదవ్, వేణు తదితరులున్నారు.

విద్యుత్ పోల్ ఏర్పాటుకు ఎదురుచూపులు


పోల్ కోసం కట్టిన డీడీ

మద్దూరు, ఆగస్టు 7: మద్దూరు మండల కేంద్రానికి చెందిన ఓ మహిళా రైతు విద్యుత్ పోల్స్ కోసం డీడీ కట్టి ఏడాది దాటింది. పలు మార్లు విద్యుత్ అధికారులతో పాటు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసినా కాలయాపన చేస్తున్నారని రైతు సాలేహాబేగం ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఈ విషయమై బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడింది. వ్యవసాయ పొలం వద్ద రెండు విద్యుత్ పోల్స్ కోసం ఆగస్టు 5, 2023లో రూ.5790లు చెల్లించి డీడీ తీసి విద్యుత్ శాఖాధికారులకు అందించినట్లు తెలిపారు. నిబంధనల మేరకు మూడు మాసాల్లో ఏర్పాటు చేయాల్సి ఉన్నా అవేమి పట్టించుకోకుండా కాలయాపన చేస్తుండడంతో విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి విద్యుత్ పోల్స్ ఏర్పాటు జరిగేలా చూస్తామని చెప్పి ఏడాది గడిచినా విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తల్లిపాలు అమృతంతో సమానం

● ఐసీడీఎస్ ఏసీడీపీవో ఛాయాదేవి, ఎంపీడీవో జనార్దన్


చిన్నకోడూరు: సీమంతం చేస్తున్న అధికారులు

చిన్నకోడూరు, ఆగస్టు 7: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ ఏసీడీపీవో ఛాయాదేవి, ఎంపీడీవో జనార్దన్ అన్నారు. చిన్నకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై వారు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, పోషణ్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, మెడికల్ అధికారి ప్రియాంక, ఇన్‌చార్జి ఏపీఎం కొమురయ్య, సీసీ శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నవజాత శిశువులకు తల్లిపాలు శ్రేష్ఠం

సిద్దిపేట రూరల్ ఆగస్టు7: నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠమని నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ పాండురంగాచారి పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కొండ్ర కనకలక్ష్మీ, కొత్త అరుణ, ఏఎన్ఎంలు సంతోష, సుజాత, ఆశావర్కర్లు ఘనపురం ఇందిర, గణపురం రజిత, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

అనర్హులను తొలగించాలి

● కళావేదిక రాష్ట్ర నేతల బృందం సభ్యులు


కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

తొగుట, ఆగస్టు7: తెలంగాణ సాంస్కృతిక సారథి పేరుతో గత ప్రభుత్వం హయాంలో అనర్హులకు ఉద్యోగాలు వచ్చాయని, వాటిని పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంకు కళావేదిక రాష్ట్ర కమిటీ బృందం సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఉద్యమంలో ఎంతోమంది కళాకారులు ఇల్లు, పిల్లలను వదిలి రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. కళాకారులకు గత ప్రభుత్వం సాంస్కృతిక సారథి పెట్టి ఎలాంటి నోటిఫికేషన్, ప్రకటన లేకుండా 550 మందికి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సాంస్కృతిక సారథిలో నియమించిన అనర్హులని తొలగించి నిజమైన ఉద్యమ కళాకారులకు అవకాశం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. కోదండరాం స్పందించి ఈ విషయమై ప్రభుత్వం పెద్దలతో మాట్లాడి ఉద్యమ కళాకారులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

'ఉన్నత శిఖరాలను అధిరోహించాలి'


లచ్చపేట ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

దుబ్బాక, ఆగస్టు 7: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. మండలంలోని లచ్చపేట ఆదర్శ పాఠశాల, రామక్కపేట గురుకుల పాఠశాలను బుధవారం తన బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆదర్శ పాఠశాలలను సందర్శించాలని రాష్ట్ర సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాల అందాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నిలాదేవి, ప్రవీన్, శంకర్, రాంబాబునాయక్, లక్ష్మీనారాయణ, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి కవిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీరాంరెడ్డి, జిల్లా ఎస్టీ వెల్ఫేర్ అధికారి అఖిలేష్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో సదానందం, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, కమిషనర్ రమేష్‌కుమార్, ఎంఈవో ప్రభుదాస్, కౌన్సిలర్ బంగారయ్య తదితరులున్నారు.

10శాతం రాయితీతో ఆర్టీసీ అద్దె బస్సులు

సిద్దిపేట అర్బన్, జూలై 7: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పెళ్లిళ్లు, శుభకార్యాలకు 10 శాతం రాయితీతో ఆర్టీసీ అద్దె బస్సులు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుందని సిద్దిపేట ఆర్టీసీ డీపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి వచ్చే నెల3 వరకు అన్ని రకాల బస్సులను అద్దెకు ఇస్తామన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

హుస్నాబాద్/దుబ్బాక, ఆగస్టు 7: హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, పద్మశాలి చేనేత కార్మిక సంఘాల నాయకులు గాజుల భగవాన్, బూర్ల రాజయ్య, వివి రమణ, వడ్డెపల్లి మల్లేశం, వైద్యం సుధాకర్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, చిత్తారి రవీందర్, వెల్దండి భాస్కర్ తదితరులున్నారు. దుబ్బాక మండలంలో చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని చేనేత కార్మికులను బీఆర్ఎస్ నాయకుడు ఎంగారి రాజిరెడ్డి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనిల్‌రెడ్డి, లచ్చయ్య తదితరులున్నారు.

దాడిని ఖండిస్తూ నిరసన


కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుస్నాబాద్, ఆగస్టు 7: జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడిని ఖండిస్తూ బుధవారం హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసనకు దిగారు. న్యాయవాదులపై వరుస దాడులు జరుగడం ఆందోళనకరమన్నారు. దాడులకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, న్యాయవాదులు చిత్తారి రవీందర్, కన్నోజు రామకృష్ణ, జాల జ్యోతికుమార్, దీకొండ ప్రవీణ్‌కుమార్, దేవదాసు, సంపత్ తదితరులున్నారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు..

చేర్యాల, ఆగస్టు 7: చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ స్టడీసెంటర్‌లో 2024-25విద్యాసంవత్సరం డిగ్రీ ప్రవేశాలకు ఈనెల 18వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రణీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో చెరబోయే అభ్యర్థులు విద్యార్హతలు, ఫీజు ఇతరత్రా వివరాలను వెబ్‌సైట్ ద్వారా గానీ, కళాశాలలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9704114832, 7382929706 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పాలిటెక్నిక్ సీట్లకు స్పాట్ కౌన్సిలింగ్

చేర్యాల, ఆగస్టు 7: చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగాఉన్న సీట్లభర్తీకి ఈనెల 12వతేదీన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీ.శ్రీరాంకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2024లో ఉత్తీర్ణులైనవారితో పాటు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 8 నుంచి 11వతేదీరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పాట్ కౌన్సిలింగ్ కోసం విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి

● సైబర్ జాగృక్త్ దివాస్‌లో పోలీసులు

రాయపోల్, ఆగస్టు 7: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాయపోల్ ఎస్ఐ రఘుపతి, రామారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రామారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో నిలిచిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. చెడు అలవాట్లకు బానిసలు కావద్దని హెచ్చరించారు.

● **తొగుట:** మండలంలోని రాంపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు సైబర్ నేరాలపై తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ వాడకం వల్ల కలిగే అనార్థాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సిద్దిపేట రూరల్: మాట్లాడుతున్న ఏసీపీ మధు

● **చేర్యాల:** సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ అన్నారు. కొమురవెల్లి మండలం గౌరాయపల్లిలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, లోన్‌యాప్స్ ఇతరత్రా అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు కాల్‌చేసినా, వాట్సప్ మేసేజ్ లింకేజ్‌లు ఓపెన్ చేయకూడద ని తెలిపారు.

● **సిద్దిపేట అర్బన్:** గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు యువకులు బానిసలు కావొద్దని, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరులో గ్రామస్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ సీఐ బి.సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ జాగ్రూక్త దివాస్ సందర్భంగా సైబర్ నేరాల గురించి వివరించారు. ఆయనవెంట ఏఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.


గజ్వేల్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

● **నంగునూరు:** విద్యార్థులు సెల్‌ఫోన్‌ను పక్కన పెట్టి చదువుపై దృష్టి పెట్టాలని రాజగోపాలపేట ఎస్ఐ ఆసీఫ్ అన్నారు. సైబర్ జాగ్రూక్త దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నర్మెట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ వినియోగం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట రూరల్:** సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లిలో కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మధు మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వరెడ్డి, గ్రామస్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.